# సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

**చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రప్రభ) :** అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్‌కి అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లలిత, షకీల లు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పెద్దలు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలుచేస్తామని వ్యానిఫెస్టోలో పేర్కొని నేడు అధికారంలోకి రాగానే అంగన్వాడీలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్వాడీలను నమోదు చేసి తప్పు చేసారని, ఇప్పటికే పనిగంటల పెంచి విపరీతమైన పని ఒత్తిడిని పెంచారని గుర్తుచేశారు. అంగన్వాడీ ఆయమ్మకు 7వేలు, టీచరుకు 11500 చెల్లిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా చెప్పడానికి కూటమి ప్రభుత్వానికి సిగ్గనిపించడలేదా అని ప్రశ్నించారు. అంగన్వాడి కుటుంబంలో పిల్లలకు తల్లికి వందనం వేయకపోవడమే కాకుండా ఇంట్లోని వృద్ధులకు వృధాప్య పెంక్షన్ ఆపేసారని, భర్త చనిపోయిన వారికి వితంతు పెంక్షన్ ఇవ్వడంలేదని, వికలాంగులైన కుటుంబసభ్యులకు వికలాంగ పెంక్షన్ కూడా నిలుపుదల చేసారని, ఇస్తున్న వేతనం కూడా అంగన్వాడీ సెంటర్లోని పిల్లలకు వండి పెట్టేందుకు, సెంటర్ అద్దెలకు పెట్టుబడి పెడుతూ పిల్లలతో పస్థులు ఉండాల్సి వస్తుందన్నారు. 2019 లో మోడీ ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాల్లో కేంద్ర వాటాని పెంచుతానని వాగ్దానం చేసి ఆరేళ్లు పూర్తయినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని, ధరలు మాత్రం పెరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో వేతనాల పెంపుకోసం, సంక్షేమ పథకాలు అమలు కోసం పోరాడడానికి అంగన్వాడీలందరూ సిద్ధంగా ఉన్నారని రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు విజయ, సుజని,ధనకోటి, ప్రమీల, సరళ, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

## జీడీ నెల్లూరు ఎంపీడీఓగా కృష్ణ మహేష్‌రెడ్డి



**గంగాధరనెల్లూరు, జూన్ 16 (ఆంధ్రప్రభ):** గంగాధరనెల్లూరు మండల ఎంపీడీవోగా బి.కృష్ణ మహేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాలసముద్రం నుండి బదిలీపై గంగాధర నెల్లూరుకు వచ్చారు. కాగా, గంగాధర నెల్లూరు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సతీష్ బదిలీపై పాలసముద్రానికి వెళ్లారు.

## పాలసముద్రం ఎంపీడీఓగా సతీష్



**పాలసముద్రం, జూన్ 16 (ఆంధ్రప్రభ) :** పాలసముద్రం ఎంపీడీఓగా సతీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కృష్ణమహేష్ రెడ్డి బదిలీపై గంగాధరనెల్లూరుకు వెళ్ళారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సతీష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 2025 -26 ఆర్థిక సంవత్సరానికి మామిడి, సపోటా, జామ తదితర 9 రకాల పండ్ల తోటలు, మూడు రకాల పూల తోటల పెంపకానికి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు తహసిల్దార్ జారీచేసిన చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్‌తోపాటు జాబ్ కార్డ్, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు, వన్‌బి, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తదితర వివరాలు అందజేయాలన్నారు. అప్లికేషన్ ఇచ్చిన రైతుకు ఇంతకు ముందు ఇవ్వని వారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఇంతకుముందు, ఇప్పటికే పెట్టిన చెట్లకు కొత్తగా అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తులను అందజేయాలని ఎంపీడీవో కోరారు.

## ఐరాల తహసీల్దార్‌గా లోకేశ్వరి బాధ్యతల స్వీకరణ



**ఐరాల, జూన్ 16 (ఆంధ్రప్రభ):** ఐరాల మండలం తహసిల్దార్‌గా లోకేశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు రూరల్ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా ఐరాల తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ లోకేశ్వరికి సిబ్బంది స్వాగతం పలికారు.

## తుంబకుప్పంలో వేరుశనగ విత్తనాల పంపిణీ



వేరుశెనగ విత్తనాల కోసం నమోదు చేసుకుంటున్న రైతులు

**బంగారుపాళ్యం, జూన్ 16 (ఆంధ్రప్రభ):** మండల పరిధిలోని తుంబకుప్పం పంచాయతీలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ నిర్వహించారు. తుంబకుప్పం, పెరుమాలపల్లి పంచాయతీలకు కలిపి 200 బ్యాగుల వేరుశెనగ విత్తనాలు మాత్రమే మంజూరు కాగా రైతులు అధిక సంఖ్యలో ఎగబడ్డారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అవసరాలకు తగిన విధంగా పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్కువగా విత్తనాలు పంపిణీ చేయడం వల్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఘనంగా మహాభారత యజ్ఞం



జడ్పీటీసీని సన్మానిస్తున్న దృశ్యం

**ఐరాల, జూన్ 16 (ఆంధ్రప్రభ):** చిత్తూరు రూరల్ కుర్చివేడులో మహాభారతం యజ్ఞం, ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో మండలం టీడీపీ జడ్పిటిసి వి.సుచిత్ర కన్నయ్యనాయుడు తన తల్లిదండ్రులతో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త, పూజారులు జడ్పీటీసీకి ఘన స్వాగతం పలికి, శాలువతో సన్మానించారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

**రామకుప్పం, జూన్ 16 (ఆంధ్రప్రభ) :** మండల కేంద్రం ప్రాథమిక పాఠశాల, బందార్లపల్లి పంచాయతీ ప్రాథమిక పాఠశాల నందు టీడీపీ మండల అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షులు హరీష్ నేతృత్వంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఎంతో కృషి చేస్తుందని ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ప్రభుత్వం అందజేసిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మనోహర్, నేతలు రాజేంద్ర, సుబ్బు, ఉపాధ్యాయులు రాజేంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈకేవైసీ కోసం కార్వేటినగరం రైతుల అవస్థలు



ఈకేవైసీ కోసం వేచివున్న వృద్ధులు, మహిళలు

**కార్వేటినగరం, జూన్ 16 (ఆంధ్రప్రభ):** ఈ-కేవైసీ చేసుకోవటానికి కార్వేటినగరం మండలంలోని రైతులు మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సోమవారం అవస్థలు పడ్డారు. ఈ కేవైసీకి మూడు రోజుల గడువు మాత్రమే ఉందని మండల వ్యవసాయ అధికారిని శనివారం సమాచారం అందజేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు జమ కావాలంటే రైతులు తమ ఆధార కార్డు తీసుకువచ్చి ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. అయితే ఈ సమాచారం గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు సరిగా చేరలేదని ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ రైతు సేవా కేంద్రాలలోని సిబ్బంది ఈకేవైసీ గురించి రైతులకు సకాలంలో తెలపలేదు. దీంతో సోమవారం ఒక్కసారిగా మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో ఈ కేవైసీ కోసం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద నిరీక్షించారు. వృద్ధులు, మహిళలు సైతం నేలపై కూర్చొని నిరీక్షించారు. ఈకేవైసీ గడువు పెంచేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

## అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ అవసరం లేదు

- మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్



**సోమల, జూన్ 16 (ఆంధ్రప్రభ):** అన్నదాత సుఖీభవ సమయ పరిమితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, ఈ కేవైసీ డేటాను ఇతర యాప్‌లు నుండి తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తెలియజేసిందని సోమల మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ సోమవారం తెలిపారు. పీఎం కిసాన్ కోసం ఇప్పటికే ఈ కేవైసీ చేసుకున్నవారు, ఇప్పుడు అన్నదాత సుఖీభవ కోసము రైతులు ఈ కేవైసీ చేసుకోనవసరం లేదు అని ఎంఏఓలు, ఆర్ఎస్‌కె ఇన్చార్జులు రైతులకు తెలియజేయాలని ఆయన తెలిపారు. ఎవరైతే ఈ కేవైసీ చేసుకోవాలో పెండింగ్ లిస్ట్ మీ మీ రైతు సేవాకేంద్రాల లాగిన్స్‌లో ఉందని, లాగిన్‌లో వున్న రైతులు మాత్రమే ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతుల లిస్ట్ కొరకు మీమీ రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి తెలుసుకోవాలని ఆయన తెలిపారు.

## నాగమంగళం రోడ్డుకు మరమ్మతులపై స్థానికుల హర్షం



మరమ్మతులు పూర్తయిన రోడ్డు

**పలమనేరు రూరల్, జూన్ 16 (ఆంధ్రప్రభ) :** మున్సిపాలిటీ సమీపం నాగమంగళం వద్ద తారు రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లు క్రితం వర్షాలతో రోడ్డు పైన నీళ్లు నిలిచి పాడైపోయింది. వర్షం పడిందంటే కిలోమీటర్లు పొడవు రోడ్డుపైనే నది లాగా నీరు నిలిచి, రాకపోకలకు, పాదచారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఎన్నో ప్రమాదాలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి కలుగజేసుకొని రహదారుల భవనాల శాఖ అధికారులతో ఇక్కడి పరిస్థితిని వివరించి, మరమ్మతులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు బాగుపడడంతో స్థానికులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ద్రౌపదీ దేవికి ఘనంగా పొంగళ్లు సమర్పించిన భక్తులు



ఆలయంలో పొంగళ్ళు పెడుతున్న భక్తులు

**వెదురుకుప్పం, జూన్16 (ఆంధ్రప్రభ) :** వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో జరిగిన 95వ మహాభారత వార్షిక మహోత్సవంలో భాగంగా సోమవారం చివరి రోజు నేపథ్యంలో పలు గ్రామాలకు చెందిన మహిళలు ద్రౌపదీ దేవి అమ్మవారికి పొంగళ్ళు పెట్టేటందుకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి గుడికి ముందర బాణాసంచాలు పేల్చి, ప్రత్యేక పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పొంగళ్ళతో వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక యువకులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

సమోదిత కార్యాలయం: 501, సల్కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ-110025 సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్‌సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికి వారిచే సర్దుబాటు చేయబడలేదు రుణగ్రహీతలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలు పొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా ఉ॥11.00గం॥లకు వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీతలతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

**వేలం తేది : 26-06-2025న ఉ॥11.00గం॥లకు**

| క్ర.సం. | శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు |
| --- | --- | --- | --- |
| 1 | జూబ్లీహిల్స్ | 103942515120 | మోరస బాల గురునాథం |
| 2 | జూబ్లీహిల్స్ | 103942515104 | మోరస బాల గురునాథం |

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్